క్లుప్తంగా

ఘనంగా అర్బన్ బ్యాంకు వార్షికోత్సవం



తెనాలి టౌన్: స్థానిక కొత్తపేటలోని ది ఏలూరు కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగాబ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా ది కాకతీయ–కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ డీఎల్ కాంతారావు విచ్చేసి ప్రసంగించారు. బ్యాంకు స్థాపించిన అనతికాలంలోనే పట్టణ ప్రజల మన్ననలు పొందిందని కొనియాడారు. ఖాతాదారుల సేవే పరమావధిగా బ్యాంకు సేవలందిస్తుందని తెలిపారు. తెనాలిలో సాయంత్రం 5గంటల 45 నిమిషాల వరకు ఖాతాదారులకు సేవలందించే ఏకైక బ్యాంకు తమదేనని గర్వంగా చెప్పారు. తెనాలిలో ఇది 5వ శాఖ అని గుంటూరు జిల్లాలో మరిన్ని శాఖలు ప్రారంభించబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి రవి మోహన్, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ కిషోర్, బ్రాంచ్ మేనేజర్ శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూనికేతన్ స్కూల్లో ఘనంగా స్నాతకోత్సవం



తెనాలిఅర్బన్: బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో మంగళవారం రాత్రి ప్రీప్రైమరీ విద్యార్థుల కాన్వొకేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టభద్రుల డ్రస్సులలో విద్యార్థులు వచ్చి సర్టిఫికెట్‌లు అందుకున్నారు. ఈసందర్భంగా స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకతను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోర్టు సిబ్బంది విధులకు ఆటంకం

ఐదుగురిపై కేసు

తెనాలిరూరల్: కోర్టు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఐదుగురిపై కేసు నమోదైంది. ఓ కేసు విషయంలో తెనాలి నాజరుపేట తిరుపతమ్మ గుడి సమీపంలో ఇంటిని ఖాళీ చేయించమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు సిబ్బందిని ఆదేశించింది. ఇల్లు ఖాళీ చేసేందుకు కోర్టు సిబ్బంది బుధవారం వెళ్లగా అక్కడ నివసిస్తున్న సాయిజ్యోతి, లక్ష్మితిరుపమ్మ, వెంకటేశ్వరమ్మ, నరసింహ, వెంకటేశ్వర్లు వారిని అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించారు. ఇదే విషయమై కోర్టు సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయగా వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



తెనాలిరూరల్: కాశ్మీర్‌లోని బైసరన్ వ్యాలీలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించారు. బోస్‌రోడ్డులోని పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా గాంధీచౌక్‌కు చేరుకుని ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళి అర్పించి సంతాపం తెలిపారు.

ధాన్యం లారీ బోల్తా

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు ధాన్యం తీసుకు వెళుతున్న లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. నరసరావుపేట సమీపంలోని పాలపాడు గ్రామం నుంచి ధాన్యం లోడుతో రాజమండ్రికి లారీ వెళుతుంది. దారిలో ఫిరంగిపురంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు.

టెన్త్ ఫలితాల్లో విద్యార్థుల విజయదుందుభి

- సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- 591 మార్కులతో తెనాలిలో ప్రథమస్థానంలో నిలిచిన షేక్ ఉస్నిజాహ
- తెనాలి పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో 72.6 శాతం ఉత్తీర్ణత



విద్యార్థులకు మెమెంటోలు అందిస్తున్న నెహ్రూనికేతన్ స్కూల్ ఎండీ మురళీకాంత్



ప్రథమస్థానం సాధించిన విద్యార్థులతో ఎంఈవో లక్ష్మీనారాయణ



మంచి మార్కులు సాధించిన విద్యార్థులతో చైతన్య స్కూల్ ప్రతినిధి గోపిచంద్



విద్యార్థులను అభినందిస్తున్న మాంటిస్సోరి స్కూల్ ప్రిన్సిపల్ జేమ్స్ మోర్లే

తెనాలిఅర్బన్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. తెనాలి పట్టణ పరిధిలోని ఆరు మున్సిపల్ హైస్కూల్స్‌లో సగటున 60శాతం ఉత్తీర్ణత సాధించారు. వీటిలో కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ బాలికల హైస్కూల్ విద్యార్థినీ షేక్ ఉస్ని జాహ 600మార్కులకు 591 మార్కులు సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలచింది. అలాగే స్కూల్ ఉత్తీర్ణత శాతం కూడా 72.6గా ఉంది. అలాగే ఐతానగర్‌లోని ఎస్ఎస్ఎస్ఎంహెచ్ స్కూల్‌కు చెందిన బి లక్ష్మి మాధురి, షేక్ ఫరీద్‌లు 583 మార్కులతో రెండవ స్థానంలో నిలచారు. కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ బాలికల హైస్కూల్ విద్యార్థినీ కాసంశెట్టి వెంకట నాగలక్ష్మి సుజాత 582 మార్కులతో మూడవ స్థానంలో నిలచింది. తెనాలి మండల, పట్టణ పరిధిలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1223 మంది పరీక్షలు వ్రాయగా వారిలో 888 మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 72.6గా ఉంది. గతేడాదితో పోల్చుకుంటే ఈఏడాది ఉత్తీర్ణత శాతం మూడు శాతం ఎక్కువగా ఉంది. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. తెనాలి పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఫలితాలు ఈ విధంగా ఉన్నాయి.

+ బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం స్కూల్ కు చెందిన షేక్ సుహానా 589 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ జేమ్స్ మోర్లే తెలిపారు. తమ పాఠశాలలోని విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు.

- బస్టాండ్ సమీపంలోని డాక్టర్ కెకెఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థి ఎస్ జోయల్ త్యాగి 595 మార్కులు సాధించారని ప్రిన్సిపల్ కె శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ ఎ.సుధాకర్‌రెడ్డిలు తెలిపారు.590కిపైగా 2, 580కి పైగా 13 మంది సాధించినట్లు చెప్పారు. వీరికి స్కూల్ ఆవరణలో అభినందించారు.
- బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 500 మార్కులకు పైగా 55 మంది సాధించారని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ తెలిపారు. సయ్యద జునేరా ఫాతిమా 586 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలచారన్నారు. వీరిని స్కూల్ ఆవరణలో అభినందించారు.
- దేవిచౌక్‌లోని షారోన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ఎస్.ప్రణీత 575 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.మేరీ బెనర్జీ తెలిపారు. 500కుపైగా 11 మంది సాధించినట్లు చెప్పారు.
- మారీసుపేట రెండు గేట్ల మధ్యంలోని సెయింట్ పాల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో 10వ తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ డైరెక్టర్‌లు చావలి అకుల్‌నాథ్, చావలి తేజోనాథ్‌లు తెలిపారు.



జోయల్ త్యాగి

- శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయఢంకా మ్రోగించారు. రుక్మిణీ 596 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలచారని ఏజీఎం అంజయ్య, ఆర్ఐ అప్పాజీలు తెలిపారు. అలాగే చరణ్‌తేజ 594, బాలాజీ, వర్ధన్ సాయిలు 593 మార్కులు నిలిచారని చెప్పారు. వీరిని స్కూల్ ఆవరణలో అభినందించారు.

కొల్లిపర మండలంలో..

కొల్లిపర: కొల్లిపర మండలంలో 2024–25 పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో 361 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా వారిలో 315 మంది విద్యార్థులు ఉత్తీర్ణత కాగా, 84 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి 1, 2 జి.సాల్మాన్‌రాజ్, కె.ఝాన్సీలత తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం పదవ తరగతి పరీక్ష పలితాలు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈసారి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో అత్యధికంగా ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మండలంలో ఆరు ప్రభుత్వ పాఠశాలలో 289 మంది పరీక్షలు వ్రాయగా వీరిలో 244 మంది విజయం సాధించారు.

మండలస్థాయి ఉత్తీర్ణతలో వల్లభాపు రం గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థిని టి.పూజిత రెడ్డి 591 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం వచ్చినట్లు, మున్నంగి గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని సీహెచ్ జీవన 587 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం వచ్చినట్లు, ఎన్.సుచరిత్ర 583 మార్కులు సాధించి మండలస్థాయిలో తృతీయ స్థానం వచ్చినట్లు తెలిపారు.

ఈ సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణతలో ఎక్కువ శాతం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు సాధించటం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను, మండల స్థాయిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.

91.60 శాతం ఉత్తీర్ణత సాధించిన జెడ్పీ హైస్కూళ్లు

తెనాలిరూరల్: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థులు రాణించారు. కార్పొరేట్ పాఠశాలలు ధీటుగా ఫలితాలు సాధించడమే కాకుండ గతం కన్నా మెరుగైన ఫలితాలను రాబట్టారు. సంగంజాగర్లమూడి జెడ్పీ హైస్కూలు విద్యార్థిని మద్దినేని మనోజ్ఞ 591 మార్కులు సాధించి మండలంలోని జెడ్పీ హైస్కూళ్ల విద్యార్థుల్లో మొదటి స్థానంలో నిలిచింది. ఖాజీపేట జెడ్పీ హైస్కూలు విద్యార్థిని కె. ఎస్తేరు చిరంజీవమ్మ 583 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచింది. కొలకలూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థిని కాలిశెట్టి పద్మప్రియ 581 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచింది. తెనాలి మండలంలో మొత్తం ఎనిమిది జెడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి. వీటిలో చదువుకున్న 405 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 371 మంది ఉత్తీర్ణులయ్యారు. అంగలకుదురు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు 74 మంది పరీక్షలకు హాజరవగా 68 మంది ఉత్తీర్ణులయ్యారు. కొలకలూరు జెడ్పీ హైసూలు విద్యార్థులు 72 మంది పరీక్షలు రాయగా 67 మంది ఉత్తీర్ణులయ్యారు. ఖాజీపేట జెడ్పీ హైస్కూలు నుండి 24 మంది పరీక్షలకు హాజరవగా 23 మంది ఉత్తీర్ణత సాధించారు.

పెదరావూరు జెడ్పీ హైస్కూలు నుండి 109 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 63 మంది ఉత్తీర్ణులయ్యారు. సంగంజాగర్లమూడి జెడ్పీ హైస్కూలు విద్యార్థులు 96 మంది పరీక్ష రాయగా 76 మంది ఉత్తీర్ణులయ్యారు. నందివెలుగు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు 29 మంది విద్యార్థులకు నూరు శఋతంగా అందరూ ఉత్తీర్ణలయ్యారు. కఠెవరం జెడ్పీ హైస్కూలు నుంచి 47 మంది పరీక్ష రాయగా 23 మంది ఉత్తీర్ణత సాధించారు. బుర్రిపాలెం జెడ్పీ హైస్కూలు నుండి 28 మంది పరీక్షకు హాజరవగా 22 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇక గిరిజన గురుకుల బాలికల పాఠశాల బాలికలు 24 మంది పరీక్ష రాయగా 18 మంది ఉత్తీర్ణత సాధించారు. అలానే గగిరిజన గురుకుల బాలుర పాఠశాలో 16 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా ఏడుగురు ఉత్తీర్ణులయ్యారు.

తగ్గిన విద్యార్థులు.. పెరిగిన ఉత్తీర్ణత శాతం.. గతేడాదితో పోలిస్తే ఈ ఏడు జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి పరీక్షలు విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గతేడాది 569 మంది పరీక్షలు రాయగా 67.66 శాతంగా 385 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది కేవలం 405 మంది మాత్రమే పరీక్షలు రాశారు. వీరిలో 91.60 శాతంగా 371 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాదితో పోలిస్తే 164 మంది తక్కువగా విద్యార్థులు మండలంలోని జెడ్పీ హైస్కూళ్లలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యారు. ఈ సారి ఉత్తీర్ణత శాతం 91.60 రావడానికి మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తీసుకున్న చొరవే అని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.



షేక్ ఫరీద్



డి లక్ష్మిమాధురి



సి.హెచ్.జీవన



ఎన్.సుచరిత్ర

స్కూల్‌పేరు	ఉత్తీర్ణతసాధించిన విద్యార్థుల సంఖ్య	ఉత్తీర్ణత శాతం
ఎఏఎస్ఎంహెచ్‌స్కూల్	77	67.6
ఎస్‌సీఆర్ఎస్ఎంహెచ్ స్కూల్	93	61.2
టీఎస్ఆర్ఎంహెచ్‌స్కూల్	29	67.4
ఎస్ఎస్ఎస్ఎంహెచ్‌స్కూల్	57	73.1
ఎస్ఆర్ఎస్ఎంహెచ్ స్కూల్	90	62.1
ఎస్‌డీఐఎంజీహెచ్‌స్కూల్	888	72.6

మెడిసిన్ చదవటమే లక్ష్యం

తెనాలిఅర్బన్: పేదింట విద్యాకుసుమం వెలసింది. ప్రభుత్వ పాఠశాలలో చదవుతూ పదోవ తరగతి ఫలితాల్లో 591 మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానంలో నిలచింది తెనాలికి చెందిన షేక్ ఉస్నిజాహ. తండ్రి గౌస్ బాబు శిల్పాలు తయారు చేస్తుంటాడు. తల్లి హన్ని గృహిణి. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు అబ్దుల్ రహిమాన్ ఇంజనీరింగ్ చదువుతున్నాడు. కుమార్తె ఉస్ని జాహ పదోవ తరగతిలో మున్సిపల్ స్కూల్స్‌లో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. ఈమె ఒకటో తరగతి నుంచి అయిదోవ తరగతి వరకు అక్షర గీత స్కూల్‌లో చదివింది. ఆరు నుంచి కొత్తపేటలోని శ్రీమతి దొడ్డపనేని ఇందిరా మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో చదివింది. ఇంటర్‌లో బైపీసీ తీసుకుని డాక్టర్ కావాటమే తన లక్ష్యమని విద్యార్థినీ తెలిపింది.

పేదింట విద్యా కుసుమం

- టెన్త్ ఫలితాల్లో 591 మార్కులు సాధించిన ఆటో డ్రైవర్ కుమార్తె
- మండలంలో మొదటి స్థానంలో నిలచిన మద్దినేని మనోజ్ఞ



మనోజ్ఞకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, మధుబాబు

తెనాలిరూరల్: పేదరికం ఆ చిన్నారి చదువుకు ఆటంకం కలిగించలేకపోయింది. ఉన్న కొద్దిపాటి వనరులను వినియోగించుకుని అకుంఠిత దీక్షతో చదువుకుని మండలంలోనే మొదటి స్థానంలో నిలచింది. మండలంలోని సంగం జాగర్లమూడి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి చదివిన మద్దినేని మనోజ్ఞ 600కు గాను 591 మార్కులు సాధించి మండలంలోని ఎనిమిది జెడ్పీ హైస్కూళ్లలో మొదటి స్థానంలో నిలిచింది. మనోజ్ఞకది సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబం. తండ్రి మధుబాబు ఆటోడ్రైవర్‌గా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. తల్లి ఆదిలక్ష్మి గృహిణి. ఇద్దరు ఉమార్తెల్లో మనోజ్ఞ పెద్దది. తెనాలికి చెందిన వీరి కుటుంబం 13 ఏళ్ల క్రితం సంగం జాగర్లమూడికి వెళి స్థిరపడ్డారు. మనోజ్ఞ అక్కడే విద్యాభ్యాసం చేసింది. వీలు కుదిరితే తండ్రి ఆటోలో స్కూలు వద్ద దింపే వాడు. లేదంటే మనోజ్ఞ షేర్ ఆటోలో వెళ్లేది. స్కూలు నుంచి రావడం ఆ రోజు పాఠశాలలో బోధించిన అంశాలను తిరిగి చదువుకోవడం, ముఖ్యమైన అంశాలను రాసుకోవడం చేస్తుండేది. ఇలా ప్రతి రోజు ఇంట్లోనే ఒక్కతే చదువుకుంటూ వచ్చి 591 మార్కులు సాధించింది. భవిష్యత్తులో ఐఐటీలో సీటు సాధించి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలన్నది తన కల అని 'సాక్షి'తో చెప్పింది. పేదరికం విసిరిన సవాళ్లను దాటుకుని వికసించిన విద్యా కుసుమం మనోజ్ఞ అందరికీ ఆదర్శం.

2030 నాటికి మలేరియా రహిత దేశంగా మారుద్దాం

జిల్లా మలేరియా అధికారి మురళీకృష్ణ సుబ్బరాయణం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న మురళీకృష్ణ సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: 2030 నాటికి మలేరియా రహిత దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ రావి రవీంద్రనాథ్ నగర్‌లోని గిరిజన సంక్షేమ వసతి గృహ బాలికల పాఠశాలలో బుధవారం వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలేరియా దోమ కాటువల్ల వస్తుందని తెలిపారు. గతంలో మలేరియా కేసుల సంఖ్య కొంత ఎక్కువగా ఉండేవన్నారు. దీనిపై ప్రభుత్వాలు దృష్టి సారించటంతో చాలా వరకు తగ్గాయని చెప్పారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బండి విజయ్ కుమార్, ఉపాధ్యాయులు బి.నాగమణి, టీవీఎస్ నాగలక్ష్మి, మలేరియా అధికారులు వంగల పున్నారెడ్డి, శ్రీకంఠ ఉమాకాంత్, అందె బాల చంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివ నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న సుబ్బరత్నమ్మ

తెనాలి టౌన్: విద్యార్థులు పుస్తక పఠనం అలవరచుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ సూచించారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారిణి కడియాల సుజాత పర్యవేక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ ఈ నెల 28వ తేది నుంచి జూన్ 6వ తేదీ వరకు గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇందులో విద్యార్థులతో స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్, ఇన్‌డోర్ గేమ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్, ఎస్సేరైటింగ్ తదితర కాంపిటేషన్స్ ఉంటాయని తెలిపారు. విద్యార్థులు గ్రంథాలయాల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర కార్యక్రమ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

102 మందికి కంటి వైద్య పరీక్షలు



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.గిరిధర్, ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ ఎండీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: పట్టణంలోని బార్ అసోసియేషన్ హాలులో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రేపల్లె బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏ ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ వైద్యులు 102 మందికి కంటి పరీక్షలు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని సీనియర్ సివిల్ జడ్జి కె. వెంకటేశ్వర్లు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి గీత, రేపల్లె రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య,

ద్విచక్ర వాహనంపై ఉంచిన బ్యాగ్ చోరీ



పార్క్ చేసిన ద్విచక్రవాహనం వద్ద బ్యాగ్ దొంగిలిస్తున్న వ్యక్తి

మంగళగిరి టౌన్: పార్క్‌చేసి ఉన్న ద్విచక్రవాహనంపై ఉంచిన బ్యాగ్‌ను చోరీ చేసిన సంఘటన మంగళవారం రాత్రి పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. అంబటి నగర్‌కు చెందిన యలవర్తి లిల్లీపుష్ప మంగళవారం ఉదయం రేపల్లెలోని తన పుట్టింటికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. తిరిగి వచ్చే క్రమంలో వడ్లపూడి సెంటర్‌లో తన స్నేహితురాలను కలవడానికి తన ద్విచక్రవాహనాన్ని పార్క్‌చేసి లోపలకు వెళ్లారు. 15 నిమిషాల తరువాత బయటకు వచ్చి చూడగా బండి ముందు భాగంలో పెట్టిన తన బ్యాగ్ కనిపించకపోవడంతో ఆ షాపు సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు రెక్కీ నిర్వహించగా ఇద్దరిలో ఒక వ్యక్తి వచ్చి బ్యాగ్ తీసుకుని బైక్‌పై పారిపోయినట్లు గమనించారు. దీంతో మహిళ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడికొండ: రాజధాని నిర్మాణ పనులకు వచ్చి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తుళ్లూరు మండలం నెక్కల్లు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45–50 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తి గుండెపోటుతో మరణించినట్లు తెలిపారు. నెక్కల్లులో రాజధాని నిర్మాణ పనుల్లో భాగంగా అండర్ డ్రైనేజీ కాలువలు తవ్వే పనికి వికారాబాద్ ప్రాంతం నుంచి తలారి మోహన్ అనే వ్యక్తి రాజధాని నిర్మాణ పనుల నిమిత్తం వస్తుండగా రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి కలిశారు. తనకు ఉపాధి కావాలని కోరగా అమరావతి రాజధాని ప్రాంతంలో పనుల కోసం తాను వెళుతున్నానని చెప్పగా వెంట తీసుకొని వచ్చి గత రెండు రోజులుగా డ్రైనేజీ నిర్మాణ పనుల్లో పాలు పంచుకుంటున్నారు. బుధవారం పనిచేస్తూ ఒక్కసారిగా కుప్పకూలడంతో ఆర్ఎంపీ వైద్యుడు వద్దకు తీసుకెళ్లగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి పేరు బాబు అని, కుటుంబంతో విభేదించి 10 సంవత్సరాలుగా విడిపోయి ఉంటున్నట్లు తెలిపారని ఇతర వివరాలు తనకేమీ తెలియదని సహచర కూలీలు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాబురావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.